క్లుప్తంగా

నేడు విద్యుత్ బంద్

పెనగలూరు : మండలంలోని కట్టావారిపల్లి పరిసర ప్రాంతాలలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ షఫీ తెలిపారు. కట్టావారిపల్లి ఫీడర్ ప్రాంతాలలో ఉన్న కె.అప్పారాజుపేట, మూగవారిపల్లి గ్రామాల పరిసర ప్రాంతాలలో ఉన్న ఇతర గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

నేడు మండల సమావేశం

సిద్దవటం : సిద్దవటం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం జరుగునని ఎంపీడీఓ జవహర్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో, మండల అధ్యక్షురాలు జ్యోతి వెంకటమ్మ అధ్యక్షతన ఉంటుందన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

సిద్దవటం : కరాటే పోటీల్లో శ్రీ సాయిహైస్కూల్ విద్యార్థులు ఆరుగురు ప్రతిభ చాటి బంగారు పతకాలు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ పి.వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ టెంపుల్ ఆఫ్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో తిరుపతిలో ఎస్వీ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఆదివారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ఓపెన్ సౌత్ జోన్ చాంపియన్ 2024 రాష్ట్రస్థాయిలో కరాటే పోటీల్లో ఆరు మంది విద్యార్థులు పాల్గొని బంగారు పతకాలు సాధించారన్నారు. విద్యార్థులు మాస్టర్ క్రిష్ణ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకున్నారని చెప్పారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను ప్రిన్సిపల్ రేవతిదేవి, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ప్రతిభకు ప్రోత్సాహం

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని పర్వతరెడ్డిగారిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈ ఏడాదిలో పదో తరగతి పరీక్షా ఫలితాలలో 477 మార్కులు సాధించి తిరుపతి పద్మావతి జూనియర్ కళాశాలలో చదువుతున్న నాగ భవిత అనే విద్యార్థికి బుక్స్ కోసం లక్కిరెడ్డిపల్లి మండల మానవత సంస్థ వారు రూ. 4 వేలు సంస్థ వ్యవస్థాపకులు ఎన్.రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి విద్యార్థినికి అందజేశారు.

పంట నమోదు తప్పనిసరి

రాజంపేట రూరల్ : రైతులు సాగు చేసిన ఉద్యాన పంటల వివరాలను ఇ-పంట యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల ఉద్యాన అధికారి జి.సురేష్‌బాబు కోరారు. మండల పరిధిలోని పోలి, ఊటుకూరు రైతు సేవా పరిధిలో సోమవారం ఈపంట నమోదు వివరాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ పూర్ణచంద్ర, వీహెచ్‌ఏ చెంగల్‌రాయులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ వేడుకలు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని సీపీఐ కార్యాలయం వద్ద ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా సోమవారం జిల్లా సహాయ కార్యదర్శి సి.బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రాధాకృష్ణ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల సమస్యలపై కళాశాలల్లో సౌకర్యాలపై పోరాటాలు చేసి ఎన్నో విజయాలు సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నవోదయకు విద్యార్థిని ఎంపిక

సుండుపల్లె : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పల్లం రుష్విసీ నవోదయకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జయన్న తెలిపారు. రాజంపేటలోని నవోదయ విద్యాలయానికి ఎంట్రెన్స్‌లో చక్కని ప్రతిభ కనబరిచి ఎంపిక కావడంపట్ల విద్యార్థినిని ఉపాధ్యాయులు అభినందించారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి

చిన్నమండెం : పారిశుధ్యంపై దృష్టి సారించి రోగాల బారి నుండి ప్రజలను రక్షించాలని ఎంపీడీఓ దివ్య, డీఎల్‌పీఓ పార్వతమ్మలు తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఎల్‌ఈడీ వీధి దీపాలను అమర్చి విషపురుగుల బారి నుంచి ప్రజలను కాపాడాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీడీఆర్ పవన్‌కుమార్, ముసల్‌రెడ్డి, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభం ఉద్వాసన

రైల్వేకోడూరు అర్బన్ : ఈనెల 21, 22, 23వ తేదీలలో భుజంగేశ్వర ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేయనున్నట్లు దేవాదాయ ధర్మాదాయశాఖ ఈఓ కొండారెడ్డి సోమవారం తెలిపారు. పూర్వ ధ్వజస్తంభాన్ని ప్రత్యేక పూజలు నిర్వహించి ఉద్వాసన చేశారు. అలాగే బాలాలయ ప్రతిష్ఠాపన చేశారు.

'ఇంటికో స్పీకర్.. ఊరికో ట్రైనర్'

నందలూరు : ఇంటికో స్పీకర్...ఊరికో ట్రైనర్ అనే నినాదం ప్రతి ఒక్కరినీ చైతన్యపరుస్తుందని ఎంబలూరు అనీల్ కుమార్ అన్నారు. ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నల్గొండలో శని, ఆది వారాలు రెండు రోజులు నిర్వహించిన ట్రైన్ ది వర్క్ షాప్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా వ్యక్తిత్వ వికాస శిక్షణ తీసుకున్న 30 మందికి నిజామాబాద్ ఆర్టీసీ ఆర్‌ఎం సరస్వతీ చేతులమీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ నేటి సమాజానికి తనవంతుగా ఏదైనా చేయాలనుకున్న తపనతో ఇంపాక్ట్ ఫౌండేషన్‌లో చేరానని వారన్నారు. సమాజాన్ని మేల్కొల్పే ఒక ట్రైనర్‌గా ముందుకు సాగుతానన్నారు. ఈ అవార్డు తనకు దక్కినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

తీరు మారేనా.. సమస్య పరిష్కరించేనా?

- వీరబల్లి మండల కేంద్రంలో పడకేసిన పారిశుధ్య పనులు
- పోలీసుస్టేషన్ ఆవరణలోకి చేరుతున్న మురుగు నీరు
- ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్న పంచాయతీ, మండల అధికారులు



మురికినీరు రోడ్డుమీద పారి స్థానిక పోలీస్ స్టేషన్ లోకి వెళ్తున్న దృశ్యం


డ్రైనేజీలో చెత్తాచెదారం చేరడంతో రోడ్డుపై నిల్వ ఉన్న మురికినీరు

వీరబల్లి : మండల కేంద్రంలో పారిశుధ్యం పూర్తిగా లోపించింది. ఎక్కడ చూసినా మురికి కాలువలు నిండిపోవడంతో మురికినీరు వీధులలో పారుతున్నాయి. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా పోలీస్ స్టేషన్ వీధిలో మురికి కాలువలు పూర్తిగా పూడిపోయాయి. అక్కడ పారుతున్న మురికినీరు వీధుల్లోకి చేరడంతోపాటు పోలీస్ స్టేషన్‌లోకి కూడా వెళ్లడంతో అటు పోలీసులు, ఇటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్యం లోపించడంతో ప్రజలకు దోమలకాటుకు గురై జ్వరాలబారిన పడుతున్నారు. వర్షం వస్తే చాలు మండల కేంద్రంలో ఎక్కడ చూసినా నీరు నిలబడి దోమలకు నిలయం కావడంతో ప్రజలు అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ విషయాలను అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం కొలువుదీరి మూడు నెలలు కావొస్తున్న మండల కేంద్రంతోపాటు గ్రామాలల్లో పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వ్యాపిస్తోంది. దీంతో చుట్టుపక్కల నివాసాలకు, పోలీస్ స్టేషన్‌కు వెళ్లే వారు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. నెల రోజుల నుంచి వీరబల్లిలో పారిశుధ్య పనులు పడకేసినట్లు స్థానికులు తెలియజేస్తున్నారు. అధికారులు నిర్లక్ష్య వైఖరి వీడి పారిశుధ్య చర్యలు చేపట్టి మండల కేంద్రం వాసులను ఈ దురావస్థ నుంచి బయటపడేలా చూడాలంటూ స్థానికులు కోరుతున్నారు.

దోమలు అధికమయ్యాయి



నెల నుంచి మా వీధిలో మురికినీరు పారుతూ కాలువలు పూర్తిగా నిండిపోయి వీధుల్లోకి మురికినీరు ప్రవహిస్తుంది. దీంతో ఈగలు, దోమలు ఎక్కువ అయ్యాయి. దీంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. వివిధ రకాల జ్వరాలకు గురవుతున్నాం. అధికారులు వెంటనే పారిశుధ్య పనులు చేపట్టి, ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేయాలి.

– కుప్పాల చంద్రశేఖర్, వీరబల్లి

మేమే దండించాల్సి వస్తోంది



ఊరిలో ఎవరైనా రోడ్డు మీద చెత్తవేసినా, మురికి నీరు పోసినా మేమే దండించాల్సి వస్తోంది. వీరబల్లి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ దగ్గర పారుతున్న మురికినీటి కాలువ పూడిపోవడంతో ఆ మురికినీరంతా పోలీస్ స్టేషన్‌లోకి రావడంతో మాతోపాటు పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు చాలా ఇబ్బందికరంగా ఉంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి మురికినీటి సమస్యలను తీర్చాలి.

– రాజు, హెడ్ కానిస్టేబుల్, వీరబల్లి

కాలువలు పూడిపోతున్నా..



వీరబల్లిలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. పూడికతీత పనులు చేపట్టడంలేదు. కాలనీలు మురికి కూపాలుగా తయారవుతున్నాయి. కాలువలోకి మరుగుదొడ్ల వ్యర్థాలు చేరుతుండటం, కాలువలు మట్టితో పూడిపోవడంతో మురికినీరు వెళ్లడానికి వీలు లేకపోయింది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. గతంలో ఈ పరిస్థితి ఉండేది కాదు.

– యూ.శ్రీనివాసులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు

స్వాతంత్య్ర వేడుకలకు అన్ని ఏర్పాట్లు


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్

రాజంపేట : స్వాతంత్య్ర దినోత్స వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియాదేవి అన్నారు. సోమవారం ఆమె తన చాంబరులో ఆర్‌అండ్‌బీ తదితర శాఖ అధికారులతో సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సబ్ కలెక్టరేట్ క్యాంపస్‌లో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో ముందుకెళ్తామన్నారు. సబ్ కలెక్టరేట్ ప్రాంగణంలో స్వాతంత్య్ర దినోత్సవ సంబరాలను అందరు తిలకించేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. సబ్‌కలెక్టరేట్ ఏవో శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

గ్రీవెన్స్ సెల్ వచ్చే ప్రతి సమస్యను పరిష్కరించడమే తన ధ్యేయమని సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియాదేవి అన్నారు. సోమవారం అన్నమయ్య సభా భవనంలో పలువురి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సోమవారం ప్రజల నుంచి వచ్చే వినతులు పునరావృతం కారాదన్నారు. సమావేశంలో డివిజనల్ స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్మికులపై రాజకీయ వేధింపులు తగదు

రాజంపేట రూరల్ : స్కీం కార్మికులపై రాజకీయ వేధింపులు తగదని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎంఎస్.రాయుడు, పట్టణ కార్యదర్శి సికిందర్ తెలిపారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మహబూబ్‌చాంద్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ స్కీం కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చిరుద్యోగులపై వేధింపులకు పాల్పడుతోందన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చింది వెళ్లిపోండంటూ కూటమి పార్టీల నాయకులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా బలవంతంగా తొలగించే విధానాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు.

ఆదర్శ పాఠశాలలో సీబీఎస్‌సీ పరీక్షలు


పరీక్షలకు హాజరైన విద్యార్థులు

సంబేపల్లె : పదవ తరగతి విద్యార్థుల సామర్థ్యములను అంచనా వేసేందుకు ఏపీ ప్రభుత్వం తలపెట్టిన బేస్‌లైన్ పరీక్షలు సోమవారం ఆదర్శ పాఠశాలలో ట్యాబ్‌లలో నిర్వహించారు. ఈ పరీక్షల ఆధారంగా విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసి సీబీఎస్‌సీ పరీక్షల నిర్వహణపై ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకునే అవకాశముందని ప్రిన్సిపల్ దిలీప్‌కుమార్ సోమవారం తెలియజేశారు. మాట్లాడుతూ ఆదివారమే ట్యాబ్‌లను పరీక్షించామని, సీజీపీకే యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. విద్యార్థులకు 12న ఆంగ్లము, 13న గణితం, 14న సైన్స్, 17న సాంఘిక శాస్త్రంలకు సంబంధించి 50 మార్కులు బేస్‌లైన్ పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. పాఠశాలలో 74 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. ఆయనతో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కుబడిగా అభివృద్ధి శిక్షణా తరగతులు


వీరబల్లి: శిక్షణా తరగతులు ప్రారంభమైన గంటకే ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

రామాపురం/లక్కిరెడ్డిపల్లె/పుల్లంపేట/సంబేపల్లె/వీరబల్లి/సిద్దవటం : గ్రామాల అభివృద్ధికి ప్రతి సర్పంచ్ ఆయా గ్రామాల కార్యదర్శులు సహకరించాలని ఆయా మండలాల ఎంపీడీఓలు తెలిపారు. సోమవారం మండలాల పరిధిలోని ఎంపీడీఓ సభా భవనంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామాలలో ముఖ్యంగా తాగునీరు, డ్రైనేజీ కాలువలు, వీధి దీపాలు, గుంతలపై దృష్టి సారించి అవసరమైన ప్రదేశాలలో గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు పరిష్కారానికి చేపట్టాలన్నారు. పంచాయతీ సర్పంచ్‌లకు సంబంధించిన విధి విధానాల గురించి వారికి వివరించారు. కార్యక్రమంలో మండలాధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కాగా జరిగిన వీరబల్లెలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌ల శిక్షణా తరగతులకు సిబ్బంది, సర్పంచ్‌లు గైర్హాజరయ్యారు. హాజరైన వారు కూడా గంట మాత్రమే ఉండటంతో శిక్షణా తరగతులు కాస్త ఖాళీ కుర్చీలకు చెప్పాల్సిన పరిస్థితి కనిపించింది. మొదటి రోజే ఈ విధంగా ఉంటే మంగళవారం ఏ మాత్రం అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారోనని పలువురు మండలాధికారులు చర్చించుకుంటున్నారు.

నల్ల బ్యాడ్జీలతో వైద్యుల నిరసన


రాజంపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు

రాజంపేట : కలకత్తా నగరంలోని ఆర్‌జీకార్ మెడికల్ కాలేజీలో సెకండ్ ఇయర్ పీజీ స్టూడెంట్ మోమిత డెబనాథ్‌ను హత్యాచారం చేసిన దోషులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాజంపేట బ్రాంచి డిమాండ్ చేసింది. సోమవారం ఐఎంఏ వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డా.బాలరాజు, డా.చలమయ్య, హరిలు మాట్లాడుతూ ఇలాంటి ఘటన మరే విద్యార్థికి జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మెడికల్ కాలేజీలో జరిగిన సంఘటన యావత్తు వైద్యలోకాన్ని ఆందోళనకు గురిచేస్తోందన్నారు. వైద్యవిద్యార్థినులకు భద్రత కల్పించాలన్నారు. నిరసనలో వైద్యులు డా.సుధాకర్, డా.ధనశ్రీ, డా.సునీల్, డా.మునిబాలకృష్ణ, డా.కిరణ్‌కుమార్, డా.కామేశ్వరమ్మ, డా.విజయలక్ష్మీ, డా.జీవీఎస్ సుబ్బారెడ్డి, డా.సురేష్, రాజంపేట ఐఎంఏ కార్యవర్గసభ్యులు, పట్టణంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.

దేశభక్తిని పెంచడానికి హర్ ఘర్ తిరంగా


జాతీయ జెండాలతో విద్యార్థులు

సంబేపల్లె : ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా విద్యార్థులతో పాటు ప్రజల హృదయాలలో దేశభక్తి భావాన్ని పెంపొందించడానికి హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని పాఠశాలలో ఘనంగా నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో జిల్లా కలెక్టర్, డీఈఓల ఆదేశాల మేరకు హర్ ఘర్ తిరంగా ప్రచారాన్ని ప్రారంభించారు. మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ వరకు భారతదేశ స్వాతంత్రానికి గుర్తుగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని ప్రధానమంత్రి సూచించారన్నారు. దేశభక్తితో పాటు భారత జాతీయ జెండా గురించి విద్యార్థులకు అవగాహనను పెంపొందించడానికి పాఠశాల స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

రాయచోటి అర్బన్ : భూ కబ్జాదారులపై వెంటనే చర్యలు తీసుకోని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య హెచ్చరించారు. పేదల భూములు కబ్జాచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్రజలు సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు పెద్దమనుషులు, ప్రజాప్రతినిధులు వారి బంధువుల ముసుగులో జిల్లా వ్యాప్తంగా భూ ఆక్రమణలకు పాల్పడ్డారన్నారు. మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రికార్డులు దగ్ధమై 35 రోజులు అవుతున్నా అసలైన దోషులను అరెస్టు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. ఒకే రోజు 520 మంది తమ భూములు కబ్జాకు గురైనట్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వం బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోలేకపోయిందంటూ ఆయన ప్రశ్నించారు. కలెక్టరేట్‌కు కేటాయించిన 13 ఎకరాల భూములను అక్రమంగా రిజిస్టర్ చేయించుకున్న వారిపై అధికారయంత్రాంగం ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలన్నారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన భూ అక్రమణలపై సమగ్రవిచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఆయన డిమాండ్ చేశారు. ఈనెల 20న రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో రెవెన్యూ భూ బాధితుల అఖిల పక్ష సదస్సులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

పాఠశాల గుర్తింపును రద్దుచేయాలి

రాయచోటి అర్బన్ : విద్యార్థిని మృతికి కారణమైన ఓబులవారిపల్లె శ్రీవాణి పాఠశాల గుర్తింపును వెంటనే రద్దు చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నేత అంకన్న ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే పాఠశాల బస్సు బోల్తాపడి విద్యార్థిని మృతి చెందిందని ఆరోపించారు. పాఠశాలల బస్సులపై ఆర్టీఏ అధికారుల పర్యవేక్షణ లేని కారణంగానే ఈ సంఘటన చోటు చేసుకుందన్నారు. పాఠశాల యాజమాన్యం చిన్నారి భవ్య తల్లిదండ్రులకు రూ. 40లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ఇదే సమయంలో పాఠశాల గుర్తింపును రద్దుచేయడంతో పాటు పాఠశాల బస్సు నిర్వహణను సక్రమంగా పర్యవేక్షించని రాజంపేట ఎంవీఐని వెంటనే సస్పెండ్ చేయాలంటూ డిమాండ్ చేశారు.

పాఠశాలలు తనిఖీ చేసిన న్యాయమూర్తులు


సుండుపల్లె: విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి ఆసిఫా సుల్తానా


సంబేపల్లె: తరగతి గదులను పరిశీలిస్తున్న జడ్జి కృష్ణన్‌కుట్టి

రామాపురం : ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు లక్కిరెడ్డిపల్లె జూనియర్ సివిల్ జడ్జి ఎస్.కె.ఫైజున్నిసా సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. తరగతి గదులను, వంట గదిని, స్టోర్ గదిని పరిశీలించారు. పిల్లలకు నివాసయోగ్యంగా ఉందా లేదా పని పరిశీలించి విద్యార్థులతో కొద్ది సేపు ముచ్చటించారు. అనంతరం ప్రిన్సిపల్ పుష్పలత, ఉపాధ్యాయులతో బోధన, బోధనేతర సిబ్బందితో మాట్లాడి విద్యార్థులకు గల సౌకర్యాల గురించి ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యతో పాటు సౌకర్యాలను కల్పించాలని సిబ్బందికి తెలియజేశారు.

లక్కిరెడ్డిపల్లి : కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని, అప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని లక్కిరెడ్డిపల్లి కోర్టు సివిల్ జడ్జి షేక్ ఫైజున్నీసా పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర లీగల్ అథారిటీ వారి ఆదేశాల మేరకు సోమవారం స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వంటగది, తరగతి గదులను వారు పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగలక్ష్మీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంబేపల్లె : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహాన్ని సోమవారం సాయంత్రం రాయచోటి ఐదవ అదనపు జిల్లా జడ్జి ఎస్.కృష్ణన్ కుట్టి ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం స్టోర్ రూమ్‌ను, వంటగది, తరగతి గదులు, పరిసర ప్రాంతాన్ని పరిశీలించారు. విద్యార్థుల చదువుల గురించి ఆరోగ్యం గురించి, భోజన వసతి గురించి అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు తనిఖీ చేస్తున్నారా అని ఆరా తీశారు. నీటి సమస్య ఉందని, మినరల్ వాటర్‌ను అందించాలని తెలియజేశారు. విద్యార్థులకు చక్కగా చదువుకొని నీ బంగారు భవిష్యత్తును చక్కదిద్దుకోవాలని తెలియజేశారు.

సుండుపల్లె : విద్యార్థినులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జడ్జి ఆసిఫా సుల్తానా తెలిపారు. సోమవారం మండల కేంద్రానికి సమీపంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థినుల సమస్యలపై ఆరా తీశారు. అనంతరం వంట గదిని పరిశీలించారు. తరగతి గదులు, పాఠశాల ఆవరణాన్ని పరిశీలించారు. తాగునీటి సమస్య ఉందని సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ హుస్సేన్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి


బండి సానారెడ్డి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

పెనగలూరు : నల్లపరెడ్డిపల్లి మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బండి సానారెడ్డి (83) సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈయన 2021 వరకు నల్లపరెడ్డిపల్లి సర్పంచ్‌గా సేవలు చేశారు. కొద్దిరోజులుగా ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి సోమవారం మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. వైస్ ఎంపీపీ కొండూరు విజయ్ రెడ్డి, రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులు రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు తదితరులు మృతదేహానికి నివాళులర్పించారు.

117 జీఓను రద్దు చేయాలి

పెనగలూరు : రాష్ట్ర ప్రభుత్వం 117 జీఓను వెంటనే రద్దు చేయాలని ఫ్యాప్టో మండల కమిటీ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ అసంబద్ధాలతో కూడుకుని లోప భూయిష్టంగా ఉందని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాలు చెప్పినటువంటి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షాన రాష్ట్ర విద్యాశాఖ ఈ ప్రక్రియను అత్యవసరంగా చేపట్టిందన్నారు. పెనగలూరులో ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

రాజంపేట టౌన్ : క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తు ఉంటుందని విజన్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు పోతుగుంట రమేష్‌నాయుడు తెలిపారు. ఇటీవల తిరుపతిలో జరిగిన దక్షిణ భారత జాతీయ స్థాయి టైక్వాండో పోటీల్లో రాజంపేట ద్రోణాచార్య ఆర్ట్స్ అకాడమీ క్రీడాకారులు ప్రతిభ చూపి పతకాలు సాధించారు. క్రీడాకారులను సోమవారం ఆయన స్థానిక జీఎంసీ క్లబ్‌లో సన్మానించారు. జాతీయ స్థాయి టైక్వాండో పోటీల్లో కె.వెంకట్ వినయ్‌కుమార్, టీ.కోమల్ కార్తికేయ, కె.పునీత్, సాయి సాత్విక్ , దక్షిత, లోహిత్, రామ్‌నరసింహ, రితేష్‌లు పతకాలు కైవసం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో గ్రాండ్ మాస్టర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి


సీఎంకు వినతిపత్రాన్ని ఇస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి టౌన్ : నియోజకవర్గం అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వినతి పత్రాన్ని సమర్పించారు. సోమవారం ఆయన చాంబర్‌లో వినతిపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. రాయచోటి ప్రాంతంలో గ్రామీణ రహదారులు, జాతీయ రహదారులు, తాగునీరు. సాగునీరు, రాయచోటి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరినట్లు పేర్కొన్నారు. అందుకు కావాల్సిన నిధులు విడుదల చేయాలని కోరినట్లు చెప్పారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓలు


సూర్యనారాయణరెడ్డి, రామాపురం ఎంపీడీఓ


మల్లేశ్వరి, వీరబల్లి ఎంపీడీఓ

వీరబల్లి : వీరబల్లి ఎంపీడీఓగా మల్లేశ్వరి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె గతంలో ఎంపీడీఓగా పనిచేస్తూ ఎన్నికల ముందు ఎన్నికల విషయంపై కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు. అనంతరం ఆమె తిరిగి మాతృ మండలానికి రావడం జరిగింది.

సుండుపల్లె ఎంపీడీఓగా రామచంద్ర

సుండుపల్లె : నూతన ఎంపీడీఓగా ఎస్.రామచంద్ర సోమవారం బాధ్యతలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లకు రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. మొదటిరోజు శిక్షణా కార్యక్రమంలో గ్రామ పంచాయతీ విధులు, బాధ్యతలు, పారిశుధ్యం, చెత్త సేకరణ అంశాలపై పంచాయతీ సెక్రటరీలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రామాపురం : మండల అభివృద్ధి అధికారిగా ఎస్.సూర్యనారాయణరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల ముందు ఇక్కడ పనిచేస్తున్న ప్రభాకర్ అనంతపురం జిల్లాలోని ఆయన స్థానానికి తిరిగి వెళ్లడంతో కర్నూలు జిల్లా చాగలమర్రి ఎంపీడీఓగా పని చేసిన ఈయన బదిలీపై మండలానికి వచ్చారు. మాట్లాడుతూ ప్రజా సమస్యలు తమ దృష్టికి వస్తే పరిష్కరిస్తామని తెలియజేశారు.

భద్రకాళీ సమేతుడికి పల్లకీ సేవ

రాయచోటి టౌన్ : రాయచోటిలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామికి సోమవారం రాత్రి పల్లకీ సేవ నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకీలో ఉంచి ఆలయ మాఢవీధులలో ఊరేగించారు. ఈ పల్లకీ సేవలో స్థానికులతో పాటు కన్నడ భక్తులు విరివిగా పాల్గొన్నారు. ఈ పల్లకీ సేవను ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు చేపట్టారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తాం

పుల్లంపేట : ప్రజల నుంచి వచ్చే వినతులను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని పుల్లంపేట తహసీల్దార్ లక్ష్మీప్రసన్న అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ప్రజల నుంచి అందిన అర్జీలను సంబంధిత అధికారులకు బదిలీ చేశారు. సోమవారం మూడు అర్జీలు అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నవీన్ కుమార్, విఆర్‌ఓ సోమశేఖర్ రెడ్డి, రాధమ్మ, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్ తనిఖీ

పుల్లంపేట : మండల పరిధిలోని రంగంపల్లి పంచాయతీలోని ఆర్.వడ్డిపల్లి అంగన్‌వాడీ సెంటర్‌ను సీడీపీఓ సౌభాగ్యమ్మ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. చిన్నపిల్లలకు విద్యాబోధన అందించాలని, మధ్యాహ్న భోజనం నాణ్యత పెంచాలని, ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పాఠశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. రికార్డులు క్రమం తప్పకుండా సరి చూసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయలక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.